Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 109 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 2 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ప్రధాని దిగ్భ్రాంతి.. రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా



**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నాడు తొక్కిసలాట జరిగి 10 మంది మృతి చెందడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ ఘటన బాధాకరం. కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి గురించే నా ఆలోచనంతా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. మృతులకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున పరిహారం అందజేస్తామని పీఎంఓ కార్యాలయం ప్రకటించింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సైతం ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాగా, తొక్కిసలాటలో పలువురు గాయపడటం, వీరిలో కొందరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

## కాశీబుగ్గ ఘటనలో బాధ్యులపై చర్యలు తప్పవు : సీఎం చంద్రబాబు



**శ్రీసత్య సాయి జిల్లా, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన విషాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపుల మండలం పెద్దన్నవారిపల్లిలో సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. కాశీబుగ్గపట్నంలో ఒక ప్రైవేటు వ్యక్తి వేంకటేశ్వరస్వామి దేవాలయం కట్టారని.. కార్తీకమాసం సందర్భంగా చాలా మంది దర్శనానికి వెళ్లారని సీఎం తెలిపారు. దీనిపై పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని.. పోలీసులకు సమాచారం ఇచ్చి ఉంటే బందోబస్తు పెట్టేవాళ్లమని చెప్పారు. తొక్కిసలాట ఘటనలో 10 మంది చనిపోయారని..ఇది చాలా బాధాకరమని ఆవేదన చెందారు. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు ఇలాంటి కార్యక్రమాలు చేసి ప్రజల ప్రాణాలు తీయడం బాధాకరమని.. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామన్నారు. తుపానులో ముందస్తు ప్రణాళిక ద్వారా ఎక్కువ ప్రాణ నష్టం లేకుండా చూడగలిగామని.. తొక్కిసలాటలో ఇంతమంది మృతి చెందటం బాధాకరమన్నారు చంద్రబాబు. ఈ ఘటనను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని... విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో జరగడానికి వీలు లేదన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. దేవుడు సన్నిధిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని బాధ పడ్డారు. కాశీబుగ్గలో జరిగిన ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## కాశీబుగ్గ ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి

**శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** శ్రీకాకుళం జిల్లాలో పెను విషాదం చోటు చేసుకుంది. కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొక్కిసలాట జరిగి 10 మంది మృతి చెందారు. మృతుల్లో 9 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కార్తీక మాసంలో వచ్చే ఏకాదశి కావడంతో ఆలయానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. ఫస్ట్ ఫ్లోర్‌లోని స్వామివారి దర్శనం కోసం మెట్లు ఎక్కుతుండగా ఈ ఘటన జరిగింది. భక్తుల రద్దీతో రెయిలింగ్ ఊడిపడింది. ఈ క్రమంలో భక్తులు ఒకరిపై ఒకరూ పడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**కాశీబుగ్గ ఘటన తీవ్రంగా కలచి వేసింది : పవన్ కల్యాణ్**

కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాశీబుగ్గ ఘటన తీవ్రంగా కలచి వేసిందని చెప్పుకొచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మృతుల కుటుంబాలకు పవన్ కల్యాణ్ తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్తీక ఏకాదశి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్న క్రమంలో తొక్కిసలాటలో తొమ్మిది మంది మృతి చెందారని తెలిసి ఆవేదనకు లోనయ్యానని పేర్కొన్నారు. ఈ విషాదకర ఘటనలో మృతి చెందినవారి ఆత్మకు శాంతి కలగాలని



ప్రార్థిస్తున్నానని తెలిపారు పవన్ కల్యాణ్. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులని ఆదేశించారు. వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి తమ ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందని తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొంటుందని భరోసా కల్పించారు. ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న ఈ ఆలయంలో చోటు చేసుకున్న విషాదకర ఘటనపై విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్తీక మాసంలో రాష్ట్రంలోని శైవ క్షేత్రాలతోపాటు, ప్రముఖ ఆలయాలకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉం టుందని వెల్లడించారు. క్యూ లైన్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని దేవాదాయ శాఖ అధికారులని ఆదేశించారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆలయ ప్రాంగణాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని మార్గనిర్దేశం చేశారు. కార్తీక మాసంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనాకు వచ్చినప్పుడు పోలీసు బందోబస్తుతోపాటు, మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## పోలవరం ఆర్ & ఆర్ ప్యాకేజ్‌పై మంత్రి కీలక ప్రకటన

**ఏలూరు, (రాజధాని వార్తలు):** పోలవరం ప్రాజెక్ట్‌ను ధ్వంసం, విధ్వంసం చేసింది వైసీపీ అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శలు గుప్పించారు. శనివారం వేలేరుపాడులో పోలవరం నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... పోలవరం నిర్వాసితుల ద్రోహి జగన్ అంటూ వ్యాఖ్యలు చేశారు. నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు మొదటి దశకు లక్షా 99 వేల ఎకరాలు అవసరం ఉందని.. ఇప్పటి వరకు 86, 900 ఎకరాలు సేకరించా మని తెలిపారు. ప్రాజెక్టు రెండో దశకు 67,600 ఎకరాలు అవ సరం ఉండగా.. ఇప్పటి వరకు 29,700 ఎకరాలు సేకరించినట్లు వెల్లడించారు. సీఎం చంద్రబాబుగా ఉండగా మూడుసార్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అందజేసినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో ఒక్క రూపాయి కూడా ప్యాకేజ్ ఇవ్వలేదని మండిపడ్డారు. 'మీ డబ్బులు మీకు ఇవ్వడానికి కూడా మానవత్వం లేని వ్యక్తి జగన్' అంటూ మంత్రి దుయ్యబట్టారు. పోలవరం నిర్వాసితుల కోసం కాలనీలు నిర్మించడానికి ఒక్క ఇటుక కూడా ఇవ్వలేదన్నారు. 739 కోట్ల రూపాయలతో 49 కొత్త కాలనీల నిర్మాణానికి టెండర్లు పిలిచామని గుర్తుచేశారు. అయితే కాలనీలు నిర్మించకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మొద్దు నిద్రపోయారని ఎద్దేవా చేశారు. 17,200 కుటుంబాలకు కొత్తగా జనవరి నుంచి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అమలు చేయబోతున్నామని ప్రకటిం



చారు. 2014-2019లో పోలవరం ప్రాజెక్టు కోసం.. కేంద్రం నిధుల కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర నిధులతో పనులు చేశామని అన్నారు. 2019లో కేంద్రం నుంచి వచ్చిన రూ.3 వేల 385 కోట్ల రీయింబర్స్‌మెంట్ నిధులను జగన్ పక్కదారి పట్టించారని ఆరోపించారు. 2026 డిసెంబర్ నాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ అమలును పూర్తి చేస్తామని ప్రకటించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ నిర్వాసితుల సమస్యల కోసం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామన్నారు. పరిహారం పంపిణీలో బ్రోకర్లు లేకుండా అవినీతి జరగకుండా అధికారులు నిఘా పెట్టాలి అని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు.

## గుడివాడ గ్రేస్ గార్డెన్‌లో ఘనంగా జరిగిన గోసిపాతల వారి వివాహ మహోత్సవం






**గుడివాడ, (రాజధాని వార్తలు):** గ్రేస్ గార్డెన్ విలువ వర్షిప్ చర్చిలో నవ జనత పత్రిక ఎడిటర్, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు, బిషప్ డాక్టర్ జి. శ్యాంబాబు ఫీబే దంపతుల కుమారుడు అనురూప్, రమ్యాల వివాహం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ కేజే విక్టర్ పాల్ అధ్యక్షత వహించగా పట్టణ ప్రముఖ దైవ సేవకులు బిషప్ అప్పికట్ల జాషువా వివాహము జరిపించగా వధూవరులకు వచ్చిన ప్రజానీకానికి రెవరెండ్ బర్నబాస్ సజ్జా ఆత్మీయ అవసరమైన వాక్య సందేశాన్ని అందించారు.

రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి వచ్చిన ప్రముఖ దైవజనులు ఆర్చ్ బిషప్ కాట్రగడ్డ మార్టిన్ బిట్రగుంట ఐజయ్య బిషప్ శాంతి సాగర్ ఆర్చ్ బిషప్ డాక్టర్ పండు మద్దాల, డాక్టర్ మందా సువర్ణబాబు, పాస్టర్ యెహేజ్కేలు, రెవరెండ్ కరుణకుమార్, నేలపాటి సామ్యేలు, ఆకునూరి ఆశీర్వాదం, గోసి పాతల కుటుంబ పెద్దలు గోసిపాతల డానియెల్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్ బాబు, ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ గుడివాడ పరిసర ప్రాంత ప్రముఖ దైవజనులు శుభాశీస్సులతోపాటు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏపీ ఎంపీ ఏ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రియల్ న్యూస్ పత్రిక సంపాదకులు దుక్కిపాటి కృష్ణారావు, సీనియర్ జర్నలిస్టులు అజయ్, లక్కిశెట్టి వెంకట ప్రసాద్, సువర్ణ రాజు, బద్దె ప్రకాష్, శ్రీనివాస్ మరియు ఏపీ ఎంపీఏ నాయకులు,నవ జనత, సువార్త వెలుగు జర్నలిస్టులు, ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ ఎడిటర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, పలువురు రాజకీయ నాయకులు, రెవెన్యూ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.




విట్ యూనివర్సిటీ, అమరావతి ఏపీ - 5వ స్నాతకోత్సవం

ఫోటో సేకరణ : ఎస్ ఆర్ ఆర్

# "సోమిరెడ్డికి కాకాణి ఛాలెంజ్"






**వెంకటాచలం, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నూతన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత, మాజీమంత్రి వర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కాకాణిని తమ భుజాలపై ఎత్తుకొని, మోసుకొని వెళ్లి, అభిమానాన్ని చాటుకున్న కార్యకర్తలు. బాణాసంచా పేలుళ్లతో, యువతకేరింతలతో, నాయకులు, కార్యకర్తల నినాదాలతో దద్దరిల్లిన వెంకటాచలం మండల కేంద్రం. వేలాదిగా తరలివచ్చిన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేసిన కాకాణి. ప్రజల అవసరాల కోసం వెంకటాచలం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని విశాలమైన ప్రాంగణంలోకి మార్చి ప్రారంభించాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ప్రజల అవసరాల కోసం పనిచేస్తాయి. జిల్లాలో పార్టీ కార్యాలయాలు కూటమినేతల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు కీలకంగా వ్యవహరిస్తాయి. కూటమి పాలనలో సర్వేపల్లి సర్వం దోపిడీకి గురైంది. సోమిరెడ్డి ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఏపీ జెన్కో పై బూడిద తరలింపు, ఇతర కాంట్రాక్ట్‌లపై తన ఆధిపత్యం కోసం తన మనుషులను పంపి దాడి చేయించాడు. నేడు సోమిరెడ్డి తన అనుచరులతో, థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బూడిద తరలించే ఒక్కో బంకర్ నుండి 300 రూపాయలు వసూళ్లకు పాల్పడుతున్నారు. సోమిరెడ్డి అనుచరులు తమకు డబ్బులు కట్టని బంకర్ల డ్రైవర్లపై మారణాయుధాలతో దాడికి పాల్పడుతున్నారు. బంకర్ డ్రైవర్లు స్థానిక పోలీసులకు మొరపెట్టుకున్నా స్పందన లేదు. బాధితులు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొని వెళ్లడంతో, ఎస్పీ స్పందించి, జిల్లా పోలీసు బలగాలను పంపడంతో దాడులు చేసిన వారు పరారయ్యారు. స్థానిక యువత, నిరుద్యోగులు పరిశ్రమలలో ఉద్యోగాలు కోరుకుంటుంటే, సోమిరెడ్డి మాత్రం తన కలెక్షన్ల కోసం ఉన్న పరిశ్రమలను తరిమేస్తున్నాడు. చంద్రబాబు, లోకేష్‌లు పరిశ్రమలు రాష్ట్రానికి రావాలని పదేపదే మాట్లాడుతున్నా, సోమిరెడ్డిలాంటి వారి దౌర్జన్యాల వల్ల పరిశ్రమలు వెళ్లిపోతున్నాయి. మోంథా తుఫానులో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, సోమిరెడ్డి మాత్రం చంద్రబాబు చెప్పిన సంక్షోభంలో అవకాశాలు వెతుక్కోవాలన్న మాటలను ఆచరిస్తున్నాడు.

వరద ప్రవాహంలో సోమిరెడ్డి ధన ప్రవాహం చూసుకుంటున్నాడు. ఇరిగేషన్ పనులలో రూపాయికి వంద రూపాయలు దొంగ బిల్లుల కోసం సోమిరెడ్డి తాపత్రయపడుతున్నాడు. భారీ వర్షాలకు కండలేరు సర్వేపల్లి రిజర్వాయర్లు దెబ్బతిన్నాయంటూ, బిల్లులు పెట్టుకొని భారీ దోపిడీకి సోమిరెడ్డి పూనుకుంటున్నాడు. తుఫాను నేపథ్యంలో స్థానిక పరిశ్రమలు చేసిన సేవా కార్యక్రమాలను కూడా సిగ్గులేకుండా, సోమిరెడ్డి తానే సొంత నిధులతో చేసినట్లు ప్రచారం చేసుకున్నాడు. సోమిరెడ్డి చేస్తున్న పాపాలు, సర్వేపల్లికి శాపాలుగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులపై, చిన్న ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. సోమిరెడ్డి ప్రభుత్వ భూములను, కాంట్రాక్ట్‌లను కాజేసేందుకు ప్రజల చేత ఎన్నుకోబడిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులను తొలగించే ప్రయత్నం చేస్తున్నాడు. సోమిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే వెంకటాచలం సర్పంచ్‌ను తొలగించడం కాదు, ఎన్నికైన సర్పంచ్‌ను రీకాల్ చేయడానికి ఓటింగ్‌కు సిద్ధమా! అని సవాల్ విసురుతున్నాం. సోమిరెడ్డి సర్వేపల్లిలో చేస్తున్న దోపిడీని అడ్డుకుంటాం. నన్ను అభిమానించి, అక్కున చేర్చుకున్న వారందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

## స్వచ్ఛత, సమాజం మధ్య నర్సింగ్ విద్యార్థులే వారధి : సీబీసీ ఏడీ రమేష్ చంద్ర




**గుంటూరు, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ సమాచార & ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ - 2025 కార్యక్రమాన్ని గుంటూరులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర, స్వచ్ఛత మరియు సమాజం మధ్య వారధిగా ఉండాలని నర్సింగ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారత్ బహిరంగ మల విసర్జనరహిత దేశంగా అవతరించడంలో గ్రామీణ ఆరోగ్య కార్యకర్తలు మరియు అంగన్‌వాడీ సిబ్బంది చేసిన కృషి కీలకమని ఆయన పేర్కొన్నారు. స్వచ్ఛతా లక్ష్యాలను సాధించేందుకు ఆరోగ్య వృత్తి నిపుణులు మార్పు దూతలుగా వ్యవహరించి, స్థానిక భాగస్వాములతో సమన్వయం సాధించాలని ఆయన సూచించారు. పారిశుధ్య మౌలిక వసతుల అభివృద్ధి, అవగాహన పెంపుతో పాటు, వ్యర్థ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వం, లింగసున్నిత పారిశుధ్య - ఆరోగ్య అంశాలలో ఇంకా మెరుగు పరచవలసిన అంశాలను గుర్తించి, స్థానిక అధికారులతో కలిసి స్వచ్ఛత, సమాజ గౌరవాన్ని పెంచడంలో కృషి చేయాలని రమేష్ చంద్ర కోరారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేమూరి వసుంధర మాట్లాడుతూ, తరగతి గదులు, హాస్టళ్లలో, కళాశాల ఆవరణ పరిసరాలలో పరిశుభ్రత, ఆరోగ్యకర వాతావరణం కోసం చేపట్టిన చర్యలను వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ లక్ష్యాల సాధనకు కళాశాల కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు. గుంటూరులో రెండు రోజులపాటు సాగిన స్వచ్ఛతా ప్రచారంలో భాగంగా, సీబీసీ గురువారం లామ్‌లోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు, స్వచ్ఛతా ప్రతిజ్ఞ మరియు అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాలను నిర్వహించింది.

చదువులో ప్రతిభ, స్వచ్ఛతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న విద్యార్థులకు సీబీసీ బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసింది. విద్యార్థులు స్వచ్ఛతా ప్రతిజ్ఞతో పాటు తమ విద్యాసంస్థ ప్రాంగణంలో మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 2 నుండి ప్రారంభమైన స్వచ్ఛతా హీ సేవా - 2025 కార్యక్రమాల క్రమంలో, సీబీసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలు మరియు సంస్థల్లో దాదాపు 30 కార్యక్రమాలను నిర్వహించి వేలాది మంది విద్యార్థులకు స్వచ్ఛత అవగాహన కల్పించింది. నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్లు, మేరా యువ భారత్ వాలంటీర్లు కూడా ఈ కార్యక్రమాలలో పాలుపంచుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదికి పైగా కళా బృందాలు కూడా సాంస్కృతిక కార్యక్రమాలతో స్వచ్ఛతే సేవ - 2025 సందేశాన్ని ప్రభావంతంగా ప్రజలలోకి తీసుకెళ్లడానికి కృషి చేశారు.



**నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు. శుక్రవారం మహారాష్ట్రలోని షిర్డీ వెళ్లినవారు ఈ సందర్భంగా సాయినాధుడిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీసులు అందుకున్నారు. సాయినాధుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.**

## రైతు పక్షపాతిగా సి.సి.ఐ పనిచేయాలి



**గుంటూరు, (రాజధాని వార్తలు):** రైతు పక్షపాతిగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) పనిచేయాలని కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. పత్తి కొనుగోలుపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ప్రత్తిపాడు శాసన సభ్యులు డా.బూర్ల రామాంజనేయులుతో కలసి సంబంధిత అధికారులతో శనివారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల వాస్తవ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సి.సి.ఐ వ్యవహరించాలన్నారు. పత్తిని ఆరవేసుకునే సదుపాయం రైతుకు లేదని, రైతుల జీవన శైలిని దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజక వర్గం కాకుమాను మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడం జరిగిందన్నారు. ఉద్యాన పంటలు, వ్యవసాయ పంటలు, పత్తి పంట తుఫానుకు బాగా గురి అయిందన్నారు. అరటి, పసుపు పంటలకు హెక్టార్ కు రూ.35 వేలు చొప్పున ఖర్చు అవుతుందన్నారు. 2500 ఎకరాల్లో వరి నీటి మునిగిందన్నారు. తుఫాను వలన వచ్చిన వరదలకు 89 వేల హెక్టార్లు పంట నీట మునిగిందని, శుక్రవారం నాటికి 2,500 హెక్టార్లు నీట మునిగి ఉండగా, శనివారం నాటికి 15 వందల హెక్టార్లు నీట మునిగి ఉందన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా త్వరితగతిన పంట నష్ట అంచనాలు తయారు చేయించడం జరుగుతోందని చెప్పారు. పత్తి, మిరప, కూరగాయలు వంటి అన్ని ఉద్యాన, వ్యవసాయ పంటలు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని, కౌలు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పత్తికి రూ.8110 లు మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. పత్తి కొనుగోలులో ఏర్పడుతున్న సాంకేతిక అవరోధాలు అధిగమించి కొనుగోలు జరిగేటట్లు అధికారులకు సూచనలు చేయడం జరిగిందని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ) జనరల్ మేనేజర్ రాజేంద్ర షా, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ అయితా నాగేశ్వరరావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్య నారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.




**విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి నారా లోకేష్, హెూం మంత్రి అనిత. కాశీబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించేందుకు రోడ్డు మార్గం గుండా కాశీబుగ్గకు బయలుదేరారు.**

# వి.ఐ.టి-ఏ.పి విశ్వవిద్యాలయంలో ఘనంగా అయిదవ స్నాతకోత్సవం

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలోని విఐటి-ఏపి విశ్వవిద్యాలయ అయిదవ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జస్టిస్ ఎన్.వి. రమణ (సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి) మరియు గౌరవ అతిధిగా రాజీవ్ వర్మ (సీనియర్ డైరెక్టర్, శ్యాంసంగ్ ఎలక్ట్రానిక్స్, బెంగుళూరు) హాజరయ్యారు. విఐటి విశ్వవిద్యాలయ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డా.జి. విశ్వనాథన్ అధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జస్టిస్ ఎన్.వి.రమణ (సుప్రీం కోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి) మాట్లాడుతూ విఐటి-ఏపి విశ్వవిద్యాలయ విద్యార్థులుగా, దేశ నిర్మాణం మరియు అభివృద్ధికి మీ వంతు కృషి చేయాలని విద్యార్థులను కోరారు. ఈ అయిదవ స్నాతకోత్సవంలో పట్టభద్రులయిన విద్యార్థులను అభినందించారు. విఐటి-ఏపి విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న అనేక నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో జూనియర్ కళాశాలలో చదివి మొదటి స్థానంలో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థిని, విద్యార్థులకు విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో ఉచిత విద్య మరియు వసతి సౌకర్యాలను





అందించే స్టార్స్ పథకం చాలా గొప్ప కార్యక్రమమని తెలియచేసారు. గౌరవ అతిథి రాజీవ్ వర్మ (సీనియర్ డైరెక్టర్, శ్యాంసంగ్ ఎలక్ట్రానిక్స్, బెంగుళూరు) మాట్లాడుతూ కష్టపడి, అంకితభావంతో పని చేసే విద్యార్థులు సవాళ్లు, సమస్యలు ఎదురైనా వాటి నుండి తమ విజయాలకు బాటలు వేసుకొని జీవితంలో అభివృద్ధి చెందుతారని, స్నాతకోత్సవం అనేది అంతం కాదని అది నిరంతర అభ్యాసానికి నాంది అని తెలియచేసారు. విఐటి ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డా.జి.విశ్వనాథన్ మాట్లాడుతూ విఐటి-ఎపి విశ్వవిద్యాలయంలో స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విఐటి విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడం మరియు భవిష్యత్ నాయకులను రూపొందించడంలో అంకితభావానికి కలిగి ఉందని అన్నారు. ఈ స్నాతకోత్సవం 2025 బ్యాచ్ విద్యార్థులు ప్రదర్శించిన కృషి, సంకల్పం మరియు స్థితిస్థాపకతకు స్నాతకోత్సవం నిదర్శనంగా నిలుస్తుందని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో శంకర్ విశ్వనాథన్ (విఐటి వైస్ ప్రెసిడెంట్), డా.జి.వి.సెల్వం (విఐటి వైస్ ప్రెసిడెంట్), డా.ఎస్.వి. కోటా రెడ్డి (విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్), డా.ఎం జగదీష్ చంద్ర ముదిగంటి (రిజిస్ట్రార్), డా.ఎన్. మధుసూధన రావు (డీన్, అకాడెమిక్స్), డా.ఖాదీర్ పాషా (డిప్యూటీ డైరెక్టర్, స్టూడెంట్ వెల్ఫేర్), విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో క్లాస్ అఫ్ 2025 చెందిన 3117 మంది పట్టభద్రులు డిగ్రీ పట్టాలను అందుకున్నారు మరియు 28 మంది బంగారు పతకాలు మరియు 126 మంది ర్యాంకులు సాధించారు.

పి.హెచ్.డి - 114 ఎం.టెక్ (5 ఇయర్స్ ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ ) - 72 బి.టెక్ కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ మరియు ఇతర స్పెషలైజేషన్స్‌తో కలిపి - 2483 ఎం.టెక్ (విఎల్ఎస్ఐ) - 15 బి.టెక్ ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ మరియు ఇతర స్పెషలైజేషన్స్‌తో కలిపి - 180 బి.టెక్ మెకానికల్ ఇంజనీరింగ్ ఇతర స్పెషలైజేషన్స్‌తో కలిపి - 43 బిబిఏ - 77 బి. కామ్ - 5 బి.ఎస్సి (డేటా సైన్స్) - 22 ఎం.ఎస్సి (కెమిస్ట్రీ ) - 8 ఎం.ఎస్సి (డేటా సైన్స్) - 56 బి.ఎ. ఎల్.ఎల్.బి (ఆనర్స్)-13 బి.బి.ఎ., ఎల్.ఎల్.బి (ఆనర్స్)-14 బి. ఏ - 15.

# తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపార వేత్త సిద్దు సుబ్బారెడ్డి కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు అన్నమయ్య సర్కిల్ వద్ద గల పివిఆర్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపార వేత్త సిద్దు సుబ్బారెడ్డి కుమార్తె సిద్దు సుష్మ రాజంపేట మాజీ ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మ మనవడు మాజీ స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ఏకైక పుత్రుడు కొండూరు ప్రతుల్య రెడ్డిల వివాహ నిశ్చితార్థ వేడుకక అంగరంగ వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కాళహస్తి మాజీ శాసనసభ్యులు బి మధుసూదన్ రెడ్డి మాజీ శాసనసభ్యులు కోడుమూరు శ్రీనివాసులు మాజీ మేయర్ భాను శ్రీ మాజీ మున్సిపల్ చైర్మన్ అనురాధ విజయ డైరీ చైర్మన్ రంగన్న సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హస్తకళల డైరెక్టర్ పొట్టం శ్రీనివాసరెడ్డి ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి బిజెపి జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మామిడాల మధు ఆత్మకూరు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బోలినేనిగిరి నాయుడు నెల్లూరు నగర పాలక సంస్థ పలువురు కార్పొరేటర్లు ప్రజా ప్రతి నిధులు అధికారులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ సుంకరి ఆళ్వార్ దాస్ జయంతి వేడుకలు









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి వాకర్స్ సంస్థను స్థాపించి నడవండి నడిపించండి అనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతూ అందరూ ఆరోగ్యవంతులు కావాలనే మహోన్నత వ్యక్తి సుంకరి ఆళ్వార్ దాస్ 95వ జయంతి సందర్భంగా ఈరోజు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించడమైనది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కిలారి శ్రీనివాసులు నాయుడు. కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి. కోశాధికారి మాగంటి ప్రసాద్. ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు. షేక్ నసీర్ అహ్మద్. బిరుదవోలు రామ్మోహన్ రెడ్డి. బెల్లం చెంచయ్య నాయుడు. /కాగోళ్ళు శివయ్య. కె వెంకటరమణ. బి సదానంద రెడ్డి. ఏ రవిశంకర్. కొండూరు రామరాజు. కొప్పు కోదండ రామయ్య. శానంపూడి సుబ్బరాయుడు. వినుకొండ వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొని కార్యక్రమమును జయప్రదం చేయడం జరిగినది.

# దేశ సమైక్యతకు ప్రతీక సర్దార్ పటేల్ : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు

**- నెల్లూరులో ఘనంగా సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం, మై భారత్ నెల్లూరు సంయుక్తంగా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** భారతదేశపు ఉక్కు మనిషి, దేశ సమైక్యతా శిల్పి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం నెల్లూరులో ఘనంగా కార్యక్రమం జరిగింది. విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) మరియు మై భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో పిఆర్సి మైదానం నుండి కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కరెంట్ ఆఫీస్ సెంటర్‌లోని సర్దార్ పటేల్ విగ్రహం వద్ద యూనివర్సిటీ వైస్ – చాన్సలర్ ఆచార్య శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ “దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ పటేల్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశ సమీకరణలోనూ ఆయన చూపిన దృఢ సంకల్పం, నాయకత్వం నేటికీ మార్గదర్శకం. పటేల్ చూపిన దేశభక్తి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావాలను విద్యార్థులు అలవరచుకోవాలి. అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి” అన్నారు. మై భారత్ సమన్వయకర్త పి. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ “పటేల్ వంటి మహనీయుల అంకితభావం, పరిపాలనా నైపుణ్యాలు ప్రతి భారతీయుడికి ఆదర్శం. దేశ ఏకీకరణలో ఆయన పోషించిన విశిష్టమైన పాత్రను యువత గుర్తుచేసుకుంటూ, ఆయన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందంజ వేయాలి” అని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ. నందన్ మాట్లాడుతూ “సర్దార్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీక. ఆయన చూపిన పరిపాలనా దృక్పథం, క్రమశిక్షణ నేటికీ ప్రభుత్వ వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తోంది. యువత ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత బలపడుతుంది. ప్రతి పౌరుడు దేశ ఏకతా, సామరస్య భావనతో ముందుకు సాగాలి” అని అన్నారు. ఆర్ఐఓ వారప్రసాద్ మాట్లాడుతూ “పటేల్ చూపిన జాతీయ ఏకతా భావం, నాయకత్వ నైపుణ్యం యువతకు స్ఫూర్తి. దేశ సమైక్యతను కాపాడే దిశగా ప్రతి విద్యార్థి చైతన్యవంతుడిగా మారాలి” అని అన్నారు. డా. ఎ. మహేంద్ర రెడ్డి (డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్) మాట్లాడుతూ “సర్దార్ పటేల్ చూపిన ఏకతా, సమగ్రత, సేవాభావం ప్రతి భారత యువకుడిలో నాటాలి. ఆయన చూపిన మార్గం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుంది. సమాజ సేవ ద్వారా దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం” అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.కె.సునీత, యన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, డాక్టర్ బివి సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్, డాక్టర్ సుచరిత, మై భారత్ సమన్వయకర్తలు ఎన్.కె. యశ్వంత్, సుబ్రహ్మణ్యం రెడ్డి ,వై ఫణి రాజు, ఎల్. రాజశేఖర్, యూనివర్సిటీ అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని సర్దార్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

# “భావితరాల భవిష్యత్తు కోసమే కోటి సంతకాల సేకరణ” : కాకాణి పూజిత





**పొదలకూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, పొదలకూరు మండలం, పులికల్లు గ్రామంలో నిర్వహించిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీగా అధికార పార్టీపై విమర్శలు చేయడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పక్షాన నిలబడి పోరాటం చేస్తుంది. జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం, భావితరాలకు వైద్య విద్య భారమై, దూరం కాకూడదనే సదుద్దేశ్యంతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, తమ నిరసనను తెలియజేస్తున్నారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతో పాటు, పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను రాష్ట్రానికి తీసుకొని వచ్చేందుకు కష్టపడ్డారు. వైయస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా గ్రామాలలో ఇంటి వద్దనే పేదలకు వైద్యం అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిది. కూటమి ప్రభుత్వం పేదలకు చేస్తున్న మోసాలను తెలియజేయవల్సిన బాధ్యత మనందరిది. జగన్మోహన్ రెడ్డి సంకల్పానికి, గొప్ప ఆలోచనలకు మనం తోడుగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రజల నిర్ణయానికి కూటమి ప్రభుత్వం తలవంచి, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేంత వరకు మా పోరాటం కొనసాగుతుంది. మా కుటుంబంపై పులికల్లు గ్రామస్తులు, తమ సొంత కుటుంబ సభ్యులుగా భావించి, మాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలు ఎనలేనివి. కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

# లింగసముద్రం బయో రిసోర్స్ సెంటర్ ప్రారంభం



**డక్కిలి, (రాజధాని వార్తలు):** ఏపిసిఎన్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏ షణ్ముగం ఆదేశాల మేరకు డక్కిలి మండలం లింగ సముద్రం గ్రామంలో బయో రిసోర్స్ సెంటర్ (బి.ఆర్.సి.) ఎన్ఎఫ్ఏ స్వామికొండయ్య చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిఆర్సి మాస్టర్ ట్రైనర్ సత్యనారాయణ, ఎంటి సుహార్లత, ఎల్2 రజిని బి.ఆర్.సి. ఓనర్ శ్రీనివాసులు అనేక మంది రైతులు పాల్గొన్నారు. బి.ఆర్.సి సెంటర్‌లో వరి, నిమ్మ మొదలైన పంటకు సంబంధించిన కషాయాలు, ద్రావనాలు, నవధాన్యాలు, ఎల్లో ప్లేట్లు, సరఫరా చేస్తామని, ఈ కషాయాలతో రైతులు అనేక రోగాల నుంచి విముక్తి పొందాలని వివరించారు.

# తడిసిన ధాన్యాన్ని ఇలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలి : భాజపా నాయకుల డిమాండ్



**బాన్సువాడ, (రాజధాని వార్తలు):** బాన్సువాడ డివిజన్లోని బీర్కూరు మండల కేంద్రంలో బిజెపి నాయకులు రైతులని పరామర్శించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని అలాగే రైతులకు క్వింటాలకి 500 రూపాయలు ఇస్తా అన్న బోనస్ ఇవ్వాలని అలాగే వడ్లు కొనుగోలు చేసే సమయంలో తరుగు తీయకుండా వడ్లు కొనుగోలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని తాహసిల్దార్ కార్యాలయంలో స్థానిక తాసిల్దార్‌కి వినపత్రం అందజేయడం చేశారు. బిజెపి మండల అధ్యక్షులు నాగేల్ల సాయికిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులని వెంటనే ఆదుకోవాలి అని ఆదుకో లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేసి రైతులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెల యోగేష్, మండల ఉపాధ్యక్షులు చేపూరి హనుమాన్లు, నూకల రాము, వడ్ల బసవరాజ్ బిజెపి నాయకులు పండరి, రాజు, విట్టల్, తైతన్య పాల్గొన్నారు.

# సంపాదకీయం

## మురికితనం కరుకుతనం పాలైన మేధ

తొలి ప్రేమ నవ యవ్వన కాలాన్ని దాటదు. తరుణ ప్రాయంలో అంకురించిన మేధా ఆసక్తులు తాత్కాలికమైనవి కాక జీవితపర్యంతం వర్ధిల్లడం కద్దు. అటవీ సామాజికుల చరిత్రకారునిగా నేను నా విద్వత్ వృత్తి జీవితానికి శ్రీకారం చుట్టాను. బ్రిటిష్ వలసపాలనలో మొరటుగా ధ్వంసమైన జీవితాలు వారివి. క్రమంగా నా ఆసక్తులు, పరిశోధనలు, రచనా వ్యాసంగాలు విభిన్న అంశాల వైపుగా వికసించాయి. అయినప్పటికీ నేను తొట్టతొలుత సాగుచేసిన మేధా క్షేత్రంతో నా అనుబంధాన్ని కొనసాగిస్తూ వస్తూన్నాను. నిజానికి గత వారం రోజులూ ఒక యువ పరిశోధకుడి డాక్టొరల్ థీసిస్ చదువుతూ గడిపాను. ఇప్పుడు జార?ండ్ రాష్ట్రంగా విలసిల్లుతున్న ప్రాంతాల సామాజిక, పర్యావరణ చరిత్రను శోధించిన సిద్ధాంత వ్యాసమది. అది నన్ను బాగా ప్రభావితం చేసింది. ఎంతగా అంటే ఈ కాలమ్‌లో దాని గురించి రాసి తీరాలనే బలీయమైన ప్రేరణను నాలో పాదుకొల్పింది. బ్రిటిష్ పాలనలో సింగ్‌భూమ్ ప్రాంతంలోని ఆదివాసీ సమాజంలో సంభవించిన పరివర్తనల పూర్వాపరాలను ఆ థీసిస్ విశ్లేషించింది. ఈస్టిండియా కంపెనీ క్రమంగా ఆ ప్రాంతంపై సైనిక, పాలనాపరమైన నియంత్రణను సాధించిన వైనాన్ని తొలుత వివరించింది. ఆ తరువాత ఆ ప్రాంత ప్రాకృతిక ఆవరణాన్ని, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను వలసపాలన ఎలా పునర్వ్యవస్థీకరించిందో పేర్కొంది. వలసపాలకుల అటవీ విధానం వ్యాపార ప్రయోజనాలకు ఇచ్చిన ఎనలేని ప్రాధాన్యం, కొత్త పాలకులతో సంప్రతింపుల బాధ్యతలు నిర్వర్తించే గ్రామ పెద్ద హోదాలో చోటు చేసుకున్న మార్పులు, తమ జీవితాలలో వలసపాలన తెస్తున్న మార్పులపట్ల ఆదివాసుల ప్రతిస్పందనలు మొదలైన అంశాలను ఆ థీసిస్ విపులంగా స్పృశించింది. పర్యావరణం, సమాజం, రాజకీయాలపై దృష్టిని కేంద్రీకరిస్తూ మేధా చరిత్రపై కూడా తగు శ్రద్ధ చూపిన అధ్యయనమది. సింగ్‌భూమ్ గిరిజనులపై యూరోపియన్ అధికారుల, భారతీయ మానవ శాస్త్రవేత్తల మేధా కృషిని నిశితంగా విశ్లేషించింది. ఈ యువ చరిత్రకారుని పరిశోధనా కృషిలో ఆరు విశిష్ట వైదుష్య లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిది - జార్ఖండ్, విశాల భారత ప్రాంతాల ఆదివాసుల జీవనరీతులపై గతించిన కాలంలో విఖ్యాతులు, విస్మృతులు వెలయించిన రచనలపై సమగ్ర సాధికారతబీ రెండోది - విస్తృత శ్రేణి ప్రాథమిక ఆధారాలను కనుగొని, ఉపయోగించుకున్న సమర్థత. జాతీయ, రాష్ట్ర, జిల్లా ఆర్కైవ్‌లలో లభించే సమాచారాన్ని ఈ పరిశోధకుడు కూలంకషంగా అధ్యయనం చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. అలాగే శతాధిక సంవత్సరాల క్రితం ప్రచురితమైన పుస్తకాలు, వ్యాసాలను కూడా విస్తృతంగా సంప్రతించాడుబీ మూడోది%-% పరిశోధిస్తున్న ప్రాంతంలో క్షేత్ర కృషి ద్వారా అనుబంధ జ్ఞానాన్ని సముపార్జించేందుకు సుముఖత. 'ఒక చరిత్రకారుడికి మందమైన నోట్‌బుక్‌తో పాటు మందమైన బూట్లు కూడా అవసరం' అన్న ఫ్రెంచ్ చరిత్రకారుడు మార్క్ బ్లాచ్ (1866-1944) సూక్తిని ఈ యువ విద్వజ్ఞుడు మనసా, కర్మణా పాటించాడు (గతాన్ని సమగ్రంగా, విశ్వసనీయంగా అర్థం చేసుకోవడానికి ప్రపంచంలో కఠినమైన, ఆచరణాత్మక పనిబీ శ్రద్ధాయుతమైన, కఠిన మేధో ప్రయత్నం రెండూ అవసరమని మార్క్ బ్లాచ్ ప్రవచించారు), నాల్గవది - తన వాదనలకు మద్దతుగా ప్రాథమిక ఆధారాల నుంచి స్ఫుటమైన, భావస్ఫోరకమైన ఉటంకింపులపై పరిపూర్ణ శ్రద్ధ పెట్టాడుబీ ఐదవది - తన విశ్లేషణాత్మక అధ్యయనాలను స్పష్టమైన, సూటియైన, ఆకర్షణీయమైన వచనంలో రాశాడు. ఎక్కడా ప్రత్యేక పరిభాషను ఎక్కువగా ఉపయోగించలేదుబీ ఆరవది - బహుళ దృక్కోణాలను అంగీకరించే వివరణాత్మక విశ్లేషణ. వాదనల సూక్ష్మ విస్తరణ ప్రశస్తంగా ఉన్నది. వలస పాలనాయుగ అధికారులు, వర్తమాన ఆదివాసీహక్కుల కార్యకర్తలలో సాధారణంగా ద్యోతకమవుతుండే గతానుగతిక భావాలను ఈ యువ పరిశోధకుడు పునరుక్తం చేయలేదు. నాటి వలస పాలకులకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన ఆదివాసీ తిరుగుబాట్లు, ప్రస్తుత కాలపు ఆందోళనలు, ఉద్యమాల మధ్య ఉన్న ఘటనాత్మక సామ్యాలు, సూత్రబద్ధమైన సంబంధాలపై ఆలోచనాత్మక విమర్శలు చేశాడు. తమ ప్రశాంత, సంప్రదాయ బద్ధమైన జీవితాలలో ఆధునిక రాజ్య వ్యవస్థలు పురికొల్పిన అల్లకల్లోలానికి వ్యతిరేకంగా నాడు, నేడు ఆదివాసుల తిరుగుబాట్లను సుసంబంధంగా విశ్లేషించాడు. ఆసేతుహిమాచలం 500కు పైగా ఉన్న ఆదివాసీ సమూహాల జీవన రీతులలో విస్తారమైన వైవిధ్యాన్ని విస్మరించి సమస్త వనవాసీలను ఒక సజాతీయ సమాజంగా చిత్రించేందుకు గత కాలంలోనూ వర్తమానంలోనూ ప్రయత్నించిన రచనలలోని లోపాలను ఈ యువ మేధావి నిశితంగా విమర్శించాడు. తమ జీవనావరణాలలోకి రాజ్యవ్యవస్థల చొరబాట్లను ఆదివాసీలు ప్రతిఘటించిన తీరుతెన్నులను, కొంతమంది ఆదివాసీ పెద్దలు సొంత తెగ ప్రజలపై తమ ఆధిపత్యాన్ని పెంపొందించుకునేందుకు రాజ్యాధికారులతో కుమ్మక్కయిన వైనాలను ఈ చరిత్రకారుని సొంత పరిశోధన వివరించింది. గుణ విశేషాలు విస్తృతంగా ఉన్న ఈ థీసిస్‌లో లోపాలు, లొసుగులు లేకపోలేదు. తన అధ్యయనాలతో ప్రత్యక్ష సంబంధమున్న కొన్ని కీలక గౌణ ఆధారాలను సంప్రతించడాన్ని ఈ పరిశోధకుడు ఉపేక్షించాడు. భారతీయ మానవశాస్త్ర చరిత్రపై టీఎన్ మదన్ రచనలను ఉపయోగించుకోలేదు. జానపద గాథలు, మౌఖిక చరిత్రను మరింతగా ఉపయోగించుకుని ఉంటే పరిశోధన ఇంకా ప్రశస్తంగా ఉండేదని నేను భావిస్తున్నాను. ప్రాథమిక ఆధారాల నుంచి చేసిన ఉటంకింపులు కొన్ని సుదీర్ఘంగా ఉండి అసలు కథనాన్ని అనవసర ప్రాధాన్యాలకు మళ్లించాయి. అయినప్పటికీ నేను చదివిన భారతీయుల డాక్టొరల్ థీసిస్‌లలో ఇది చాలా ప్రతిభావంతమైనది. పరిపూర్ణమైన పరిశోధన, సందేహం లేదు.

# నవంబర్ 2న దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్తీక వనభోజనాలు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ ఆదివారం నెల్లూరు రూరల్ నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో కార్తిక వనబోజన మహోత్సవం జరుగుతుందని జిల్లాలోని దేవాంగులందరూ జయప్రదం చేయాలని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మన్నెం సతీష్ తెలిపారు. శుక్రవారం స్తానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కార్తీక మాసం సందర్భంగా కార్తీక వన వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ సంవత్సరం కార్తీక వన మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం దేవాంగ సంక్షేమ సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరుగుతుందని తెలిపారు.

ఈ కార్తీక వన మహోత్స వాలకు జిల్లా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్‌సి బీదా రవిచంద్ర, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొంటారన్నారు.

జిల్లాలోని దేవాంగ కులస్తులందరు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొండా మాధవయ్య, కోశాధికారి వార్తా రాజేంద్ర ప్రసాద్, యర్రా ధనుంజయ, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టిన టిడిపి నాయకులు షేక్ కాలేషా

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** తేదీ 31..10.2025 మున్సిపల్ శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరు నగర 42వ డివిజన్ తెలుగుదేశం పార్టీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ కాలేషా కురుస్తున్న భారీ వర్షాలకు డివిజన్లో పర్యటించి కాల్వ పూడికతీత పనులను ముమ్మరంగా చేయించారు ప్రధాన కాలువలను క్లీనింగ్ చేయించి హైడ్రోస్ప్రే బ్లీచింగ్ చేయించారు వర్షాకాలం కావడంతో దోమలు వ్యాప్తి చెందకుండా కాల్వ పూడికతీతం పనులను ముమ్మరంగా చేపట్టడం జరిగిందని తుఫాను నేపథ్యంలో మంత్రి నారాయణ అందించిన సహాయ సహకారాలు మరువలేనివని తెలియజేశారు

# సామర్లకోటలో 2న కబడ్డీ జిల్లా క్రీడాకారుల ఎంపిక



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా కబడ్డీ అసోషియన్ ఆధ్వర్యంలో 35వ సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నవంబర్ 2వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు సామర్లకోట అయోధ్య రామపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాల కోర్ట్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ ఎంపికకు వచ్చే క్రీడా కారులకు బరువు పరిమితి బాలురు 60 కిలోల కంటే తక్కువ, బాలికలు 55 కిలోలు కంటే తక్కువ ఉండాలన్నారు. వయస్సు 16 సంవత్సరాలు, అంత కంటే తక్కువ ఉండాలన్నారు. 2009 డిసెంబర్ 1 లేదా ఆ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. ఈ ఎంపికకు వచ్చే క్రీడా కారులు తప్పనిగురిగా మ్యాట్ షూ తెచ్చుకోవాలన్నారు. దీనిలో ఎంపికైన జట్లు నవంబరు 7 నుండి 9 వరకు కర్నూలు జిల్లాలలో జరుగే కబడ్డీ చాంపియన్ షిప్‌లో ఆడాల్సి ఉంటుందని ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

# తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ







**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న తమ్మవరం గ్రామంలోని పోలవరం ప్రాంత మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభు త్వం అందిస్తున్న సహాయాన్ని భాగంగా నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వయంగా ఈ కార్యక్రమంలో పాల్గొని 78 మంది మత్స్యకార కుటుంబాలకు 50 కిలోల బియ్యం బస్తా, కందిపప్పు 1 కిలో, పామ్ ఆయిల్ 1 లీటర్, ఉల్లిపాయలు 1 కిలో, బంగాళదుంపలు 1 కిలో, పంచదార 1 కిలో కలిగిన కిట్లను అందజేశారు. తుఫాన్ బాధితుల పట్ల ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైన సహాయం అందే వరకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నురుకుర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస్ బాబా, రంభాల వెంకటేశ్వరరావు, పితాని లీలా, ఖాదీ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాస్, రూరల్ ఎంపీపీ అనంతలక్ష్మి త్రిమూర్తులు, స్థానిక ఎంపీటీసీలు, అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఈవోపీఆర్డిగా జనార్దన్ రావు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** గజపతినగరం మండల పరిషత్ ఈవోపిఆర్డిగా పి.జనార్దన్‌రావుకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్.ఎ.సి) అప్పగించారు. ఈ మేరకు ఉన్నత అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనార్దన్ రావు ప్రస్తుతం గజపతినగరం మేజర్ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా జనార్దన్ రావు అన్నారు.

# విషపూరిత జలాలు అరికట్టాలంటూ ఎమ్మెల్యేకు వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** గోదావరి కాలువలో పలు పరిశ్రమలకు చెందిన విషపూరితమైన వ్యర్థ జలాలు కలుస్తున్న కారణంగా వాటిని తాగుతున్న పశుపక్షాదులు చనిపోతున్నాయని, పంటలకు వాడడం వలన పంటలు పలు రకాల వ్యాధులకు గురవుతున్నాయని ఇలాంటి విస్పూరిత జలాలు గోదావరి కాలువలో కలవకుండా చర్యలు తీసుకోవాలంటూ సామర్లకోట రైతు సంఘం నాయకులు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం సామర్లకోట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కంటే జగదీష్ మోహన్ (బాబు) ఆధ్వర్యంలో సామర్లకోటకు చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా జగదీష్ మాట్లాడుతూ సామర్లకోట గోదావరి కాలువలో ఎగువ ప్రాంతానికి చెందిన పలు పరి శ్రమల నుంచి విషపూరితమైన వ్యక్తువిషపూరితమైన వ్యర్థ జలాలు కొద్ది నెలలుగా కలుస్తున్నట్టు చెప్పారు. విపరీతమైన దుర్గంధం పుడుతూ ఈ జలాల ఉన్నందున ఈ పరిస్థితిని అరికట్టాలని ఎమ్మెల్యేకు వివరించారు. ఇదే గోదావరి జలాలను కాకినాడ నగరం, సామర్లకోట, పెద్దాపురం మున్సిపాలిటీ ప్రజలకు త్రాగునీరుగా ఉపయోగించడంతోపాటు పశుపక్షాదులకు ఇదే నీరు త్రాగడానికి ఆధారమై ఉందన్నారు. ఇంకా ఇదే గోదావరి జలాలు వరి సాగుకు ఉపయోగిస్తున్నందున కలుషితమవుతున్న ఈ జలాల కారణంగా ప్రజలకు, పశువులకు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతుండడంతోపాటు పంటలు పలు రకాల తెగుళ్ళకు గురవుతున్నాయని, దానితో రైతాంగం తీవ్ర నష్టాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కలుషిత జలాల విషయంలో తక్షణం చర్యలు చేపట్టి ప్రజలకు, పశువులకు, పంటలకు నష్టం వాటిల్లకుండా చూడాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, సొసైటీ అధ్యక్షులు పైని శ్రీనివాసరావు, రామకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), బాపినీడు తదితరులు పాల్గొన్నారు.

# మొంథా సహాయక చర్యలు సక్రమంగా అమలు చెయ్యాలి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అందించే సహాయక, సేవా కార్యక్రమాలు సక్రమం గా చేపట్టాలని పార్టీ నాయకులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప సూచించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదికలో ఎమ్మెల్యే చిన రాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాజాగా నెల కొన్న తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అందాల్సిన సహాయ చర్యలు, సేవా కార్యక్రమాలు సక్రమంగా అమలు జరిగేలా ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో యువ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, మండల అధ్యక్షులు మొయ్యిళ్ల కృష్ణమూర్తి, పెద్దాపురం మాజీ మున్సిపాలిటీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, సామర్లకోట గౌరవా ధ్యక్షులు అడబాల కుమారస్వామి, నూనె రామారావు, సామర్లకోట పట్టణ అధ్యక్షులు బడుగు శ్రీకాంత్, గుమ్మళ్ళ రామకృష్ణ, పైణ్ణి శ్రీనివాసరావు, శ్రీరా ములు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టాలెంటెడ్ హీరోకి ఈసారైనా హిట్ పడేనా?



అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని ఉందనే సామెతలాగా టాలీవుడ్ టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని విషయంలో కూడా అలానే జరుగుతూ ఉంది. అందానికి అందం, యాక్టింగ్ టాలెంట్, మంచి డ్యాన్సులు.. ఇవన్నీ ఉన్నప్పటికీ రామ్ స్టార్ హీరో కాలేకపోయారు. రామ్‌కు ఉన్న టాలెంట్‌కు అతను ఈపాటికే టైర్2 హీరోల లిస్ట్‌లో టాప్‌లో ఉండాల్సింది కానీ సరైన కథలను సెలెక్ట్ చేసుకోకపోవడం వల్ల ఇంకా సరైన సక్సెస్ లేక ఇబ్బంది పడుతున్నారు. అప్పుడెప్పుడో వచ్చిన ఇస్మార్ట్ శంకర్ తప్పించి రామ్ ఖాతాలో మరో హిట్ లేదు. ఆ సినిమా తర్వాత రామ్ నుంచి పలు సినిమాలు వచ్చినప్పటికీ అవన్నీ ఫ్లాపులు, డిజాస్టర్లుగా మిగిలాయే తప్పించి ఒక్కటీ హిట్ అయిన పాపాన పోలేదు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత మాస్ మూసలోకి వెళ్లి ఎక్కువగా అదే జానర్‌లో సినిమాలు చేసిన రామ్‌కు అవేవీ సక్సెస్‌ను అందించలేకపోయాయి. అందుకే ఈసారి తనకు బాగా నప్పే జానర్‌లోకి వచ్చి మరీ సినిమా చేస్తున్నారు రామ్. మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి ఫేమ్ మహేష్ బాబు. పి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతుంది. వరుస ఫ్లాపుల్లో ఉన్న రామ్‌కు ఈ సినిమా సక్సెస్ ఎంతో కీలకంగా మారింది. ఆంధ్రా కింగ్ తాలూకా టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా కోకోపేట్ స్టూడియోలో ఆఖరి రోజు షూటింగ్ జరుగుతుందని తెలుస్తోంది. అవుట్‌పుట్‌తో టీమ్ హ్యాపీ ఇవాల్టితో షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేసేసి గుమ్మడికాయ కొట్టబోతున్నారని, షూటింగ్ పూర్తి చేసి ఇకపై ప్రమోషన్స్ పై టీమ్ ఫోకస్ చేయనుందని తెలుస్తోంది. అంతేకాదు, ఇప్పటివరకు షూటింగ్ పూర్తి చేసుకున్న కంటెంట్ మొత్తం పాజిటివ్‌గానే ఉందని, చిత్ర యూనిట్ అవుట్‌పుట్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నారని సమాచారం. ఆల్రెడీ ఆంధ్రాకింగ్ తాలూకా నుంచి వచ్చిన గ్లింప్స్, రెండు పాటలకు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. సినిమా కూడా అలానే ఉంటే ఈ మూవీ రామ్‌కు సక్సెస్‌ను ఇవ్వడం ఖాయమనే అనుకోవాలి.

నవంబర్ 28న ఈ సినిమా రిలీజ్ కానుందని మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేయగా, ఇప్పుడీ సినిమా ఓ రోజు ముందుగానే ప్రేక్షకుల ముందుకు రాబోతుందని వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఈ విషయంలో మేకర్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వచ్చింది లేదు.


# ప్రభాస్ చేతులతో 'శంబాల' ట్రైలర్.. విజువల్స్ నెక్స్ట్ లెవెల్..!




ఆది సాయి కుమార్ హీరోగా ఉగంధర్ ముని డైరెక్షన్‌లో వస్తున్న సూపర్ న్యాచురల్ సినిమా శంబాల. ఈ సినిమాను షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌లో రాజశేఖర్ అన్నభిమోజు, మహిందర్ రెడ్డి నిర్మిస్తున్నారు. సినిమాలో ఆది సాయి కుమార్‌తో అర్చన అయ్యార్ స్క్రీన్ షేర్ చేసుకుంటుండగా శ్వాసిక, రవి వర్మ, మధునందన్ ఇంపార్టెంట్ రోల్స్‌లో నటించారు. టీజర్ తోనే సినిమాపై బజ్ పెరిగేలా చేసుకున్న శంబాల టీం లేటెస్ట్‌గా ట్రైలర్‌తో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేశారు. ఈ ట్రైలర్‌ని రెబల్ స్టార్ ప్రభాస్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. శంబాల కథ గురించి చెప్పుకుంటే వేల సంవత్సరాల క్రితం రాక్షసుడితో శివుడు యుద్ధం చేస్తున్న టైంలో శివుని చెమట చుక్క భూమి మీద పడుతుంది. అది ఒక ఊరిలో ఉండగా దాని చుట్టూ కొన్ని శక్తులు ఆవహించి ఊరి ప్రజలను బలి తీసుకుంటాయి. ఐతే ఈ మిస్టరీని చేధించేందుకు జియో సైంటిస్ట్ అయిన హీరో రంగంలోకి దిగుతాడు. ఊళ్లో వరుస హత్యలకు కారణం ఎవరు.. ఈ సూపర్ న్యాచురల్ ఎలిమెంట్స్‌కి రీజన్ ఏంటి. దైవం నమ్మని హీరో ఊళ్లో జరిగే పరిణామాలను ఎలా సాల్వ్ చేశాడు అన్నది శంబాల కథ. ట్రైలర్‌లోనే చెప్పాలనుకున్న కథ ఏంటన్నది చూపించారు. ఈ ట్రైలర్‌లో విజువల్స్ చాలా బాగున్నాయి. ఆది సాయి కుమార్ రోల్ ఇంటెన్సివ్‌గా బాగా చేశాడనిపిస్తుంది. ఇక సినిమాలో కెమెరా వర్క్, ఇంకా విజువల్స్ ఆడియన్స్‌కి మంచి థ్రిల్ కలిగించేలా ఉన్నాయి. ఈమధ్య సినిమాల్లో డివోషనల్ టచ్.. ఈమధ్య సినిమాల్లో డివోషనల్ టచ్ ఎక్కువ ఉంటుంది. ఐతే వాటిని పర్ఫెక్ట్‌గా చూపిస్తే మాత్రం ఆడియన్స్ సూపర్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. అంతేకాదు ఇలాంటి సినిమాలను బాగా ఎంకరేజ్ చేస్తున్నారు. శంబాల కథ మొత్తం ట్రైలర్‌లో చెప్పిన స్క్రీన్ ప్లే, ఇంకా విజువల్స్ ఇంకా ట్విస్ట్‌లతో ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేస్తారని అనిపిస్తుంది. డైరెక్టర్‌తో పాటు మిగతా టెక్నికల్ టీం కూడా సినిమాకు బాగా సపోర్ట్ అందిస్తున్నట్టు అనిపిస్తుంది. ఆది సాయి కుమార్ శంబాల ట్రైలర్ ఇంప్రెస్ చేసింది. కొన్నాళ్లుగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న ఆది సాయి కుమార్‌కి ఇది మంచి బ్రేక్ ఇచ్చేలా ఉంది. శంబాల సినిమాను డిసెంబర్ 25 క్రిస్మస్ రేసులో రిలీజ్ చేస్తున్నారు. మరి ఈ సినిమాతో అయినా ఆది సాయికుమార్ అనుకున్న టార్గెట్ రీచ్ అవుతాడా లేదా అన్నది చూడాలి.

# రష్మికతో సుధీర్ ఫైట్.. నెల చివర్లో రామ్ లవ్ ట్రీట్..?







కొత్త నెల వచ్చేసింది.. కొత్త వీకెండ్ సరికొత్త సినిమాల ట్రీట్ ఉండబోతుంది. అక్టోబర్‌లో దసరా నుంచి దీపావళి ట్రీట్ గా సినిమాలు రిలీజ్ కాగా అంచనాలకు తగిన సినిమాలు కొన్ని వాటిని అందుకోలేని సినిమాలు మరికొన్ని వచ్చాయి. ఇక థియేటర్‌లో లేటెస్ట్‌గా మాస్ మహారాజ్ రవితేజ మాస్ జాతర వచ్చింది. ఈ నెల కూడా సినిమాల పండగ షురూ అయ్యేలా ఉంది. కాకపోతే పెద్ద స్టార్ సినిమాలు ఏవి ఈ మంత్ రిలీజ్ లేవు. మంత్ మొదట్లో రష్మిక, సుధీర్ సినిమాల ఫైట్ ఉంటుండగా మంత్ ఎండ్ రామ్ సినిమా రేసులో దిగుతుంది. నవంబర్ 7న ఒకేరోజు 3 సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అందులో నేషనల్ క్రష్ రష్మిక మందన్న లీడ్ రోల్‌లో నటించిన ది గర్ల్ ఫ్రెండ్ వస్తుంది. చిలసౌ ఫేమ్ రాహుల్ రవింద్రన్ డైరెక్షన్‌లో ఈ సినిమా తెరకెక్కింది. రష్మికతో దీక్షిత్ శెట్టి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. ట్రైలర్‌తో ఆసక్తి కలిగించిన ఈ సినిమా రష్మిక క్రేజ్‌తో గట్టి పోటీ ఇచ్చేలా ఉంది. ఇక అదే రోజు సుధీర్ బాబు హీరోగా వస్తున్న జటాధర రిలీజ్ అవుతుంది.

ఈ సినిమాను వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ డైరెక్ట్ చేశారు. సినిమాలో సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్ లాంటి వాళ్లు నటించారు. తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ సినిమా ట్రైలర్ ఇంట్రెస్టింగ్‌గా ఉంది. సుధీర్ బాబు ఈ సినిమాతో ఎలాగైనా హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఈ రెండు సినిమాలతో పాటు తిరువీర్ నటించిన ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో కూడా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ట్రైలర్ ఆసక్తికరంగా ఉంది. ఆడియన్స్ ని ఎంటర్టైన్ చేయడమే ముఖ్య లక్ష్యంగా ఈ సినిమా వస్తుంది. నవంబర్ 7న ఈ 3 సినిమాల మధ్య ఇంట్రెస్టింగ్ ఫైట్ ఉంటుంది. ఐతే రష్మిక ది గర్ల్ ఫ్రెండ్, జటాధరలతో పోలిస్తే తిరువీర్ సినిమాకులో బజ్ ఉంది. నవంబర్ రెండో వారం 14న దుల్కర్ సల్మాన్ కాంత రిలీజ్ అవుతుంది. రానా నిర్మాతగా దుల్కర్, భాగ్య శ్రీ బోర్స్ కలిసి నటించిన ఈ సినిమా కూడా ఆడియన్స్‌లో మంచి బజ్ సంపాధించుకుంది. ఈ సినిమాతో చాందిని చౌదరి నటించిన సంతాన ప్రాప్తిరస్తు సినిమా వస్తుంది. ఐతే దుల్కర్ ఆల్రెడీ తెలుగులో వరుస హిట్లు కొడుతున్నాడు కాబట్టి కాంత సినిమాకు మంచి బజ్ వచ్చే ఛాన్స్ ఉంది. ఐతే కాంత రిలీజ్ రెండు వారాల్లో ఉన్నా ఇంకా ప్రమోషన్స్ మొదలు పెట్టలేదు. రానా ఈ ప్రమోషన్స్‌ని కొత్తగా ప్లాన్ చేస్తున్నారని టాక్. నవంబర్ చివరి వారం అంటే 29న రామ్ ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా రిలీజ్ ఒకరోజు ముందుకొస్తుందని టాక్. రామ్, భాగ్య శ్రీ బోర్స్ జంటగా నటిస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా లవ్ స్టోరీతో పాటు ప్రతి ఫ్యాన్ తనని తాను రిప్రెజంట్ చేసుకునేలా సినిమా ఉంటుందని తెలుస్తుంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ సినిమా నుంచి వస్తున్న సాంగ్స్ ఇప్పటికే ఆడియన్స్‌లో మంచి వైబ్ క్రియేట్ చేశాయి. ఆంధ్రా కింగ్ తాలూకా సినిమా కోసం రాం లిరిసిస్ట్‌గా కూడా మారాడు. మహేష్ బాబు పి డైరెక్ట్ చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాకు వివేక్ మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు. నవంబర్‌లో రాబోతున్న సినిమాలన్నీ కూడా ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తోనే వస్తున్నాయి. ప్రతి సినిమా దేనికదే ప్రత్యేకంగా అనిపించేలా ఉన్నాయి. సో టైటిల్‌లో చెప్పినట్టుగానే రష్మికతో సుధీర్ బాక్సాఫీస్ ఫైట్‌తో పాటుగా నెల ఆఖరున రామ్ ఇచ్చే లవ్ ట్రీట్ ఎలా ఉంటుందో చూడాలని ఆడియన్స్ ఆసక్తిగా ఉన్నారు.

# 'కాంతార' స్టార్‌తో టాలీవుడ్ వర్సెస్ బాలీవుడ్



'కాంతార చాప్టర్ 1' సినిమాతో, 2025లో ఇండియాలోనే బిగ్గెస్ట్ గ్రాసర్‌ను కొట్టిన రిషబ్ శెట్టి, ఇప్పుడు నేషనల్ స్టార్ అయ్యాడు. 'కెజిఎఫ్' యష్ తర్వాత, కన్నడ ఇండస్ట్రీ నుంచి మరో పాన్ ఇండియా స్టార్ దొరికేశాడు. ఇప్పుడు రిషబ్ నెక్స్ట్ స్టెప్ ఏంటి అనేది హాట్ టాపిక్ గా మారింది. అతనితో సినిమా చేసేందుకు అన్ని ఇండస్ట్రీలు పోటీ పడుతున్నాయి. ఈ పోటీలో ఇప్పుడు టాలీవుడ్, బాలీవుడ్ నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నాయి. 'కాంతార 1' ప్రమోషన్ల టైమ్‌లోనే రిషబ్ శెట్టి ఒక క్లారిటీ ఇచ్చాడు. తన తదుపరి సినిమా, టాలీవుడ్ సెన్సేషన్ ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో 'జై హనుమాన్' ఉంటుందని స్వయంగా ప్రకటించాడు. దీంతో, సౌత్ డైరెక్టర్లు ఇద్దరు (ప్రశాంత్ వర్మ, రిషబ్) కలిసి మరో మైథలాజికల్ వండర్ క్రియేట్ చేస్తారని ఫ్యాన్స్ ఫిక్స్ అయిపోయారు. అయితే, ఈ రేసులో బాలీవుడ్ సైలెంట్‌గా లేదు. వాళ్లు రిషబ్ కోసం మరో భారీ ప్రాజెక్టును సిద్ధం చేశారు. అదే, ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్ 'ది ప్రైడ్ ఆఫ్ భారత్'. కాంతార లాంటి రూటెడ్ సినిమా తీసిన హీరోతో, శివాజీ లాంటి ఐకానిక్ క్యారెక్టర్ చేయిస్తే, నార్త్ బెల్ట్‌లో సినిమా రేంజ్ వేరేలా ఉంటుందని వాళ్ల ప్లాన్. ఇక్కడే అసలు కన్ఫ్యూజన్ మొదలైంది. రిషబ్ మాట ప్రకారం 'జై హనుమాన్' ముందు మొదలవ్వాలి. కానీ, బాలీవుడ్ మీడియాలో మాత్రం 'ది ప్రైడ్ ఆఫ్ భారత్' షూటింగ్ రోలింగ్‌కు రెడీ అయిపోయిందని గట్టిగా టాక్ నడుస్తోంది.

అంతేకాదు, అందులో ఔరంగజేబు పాత్ర కోసం వివేక్ ఒబెరాయ్‌ను కూడా ఫైనల్ చేశారని వార్తలు వస్తున్నాయి. ఇది ప్రశాంత్ వర్మ టీమ్‌ను, రిషబ్ ఫ్యాన్స్‌ను డైలమాలో పడేసింది. ఇప్పుడు రిషబ్ ముందున్నది కేవలం మైథాలజీనా, బయోపికా? అనే ఛాయిస్ కాదు. ఇది టాలీవుడ్ వర్సెస్ బాలీవుడ్ ఛాయిస్‌గా మారింది. తాను పబ్లిక్‌గా మాట ఇచ్చిన టాలీవుడ్ (ప్రశాంత్ వర్మ) ప్రాజెక్టును మొదలుపెడతాడా లేక, తన పాన్ ఇండియా ఇమేజ్‌ను నార్త్‌లో మరింత స్ట్రాంగ్ చేసుకోవడానికి బాలీవుడ్ (శివాజీ బయోపిక్) వైపు అడుగు లేస్తాడా? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ రెండు పాత్రలకు దేశవ్యాప్తంగా విపరీతమైన ఎమోషనల్ కనెక్షన్ ఉంది. రెండింటికీ రిషబ్ నుంచి భారీ డెడికేషన్, ట్రాన్స్‌ఫర్మేషన్ అవసరం. వీటిని ఒకేసారి షూట్ చేయడం అసాధ్యం. మరి, ఈ టగ్ ఆఫ్ వర్‌లో రిషబ్ ఏ ఇండస్ట్రీకి ముందు ఓటు వేస్తాడో తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

# కూటమి ప్రభుత్వానిది పని తక్కువ, ప్రచారం ఎక్కువ

## - ఒకవైపున ప్రభుత్వ పెద్దలందరూ టెక్నాలజీని ఉపయోగించి తుఫాన్‌ని ఎదుర్కొన్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు - వైయస్సార్సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను

**విజయనగరం, (రాజధాని వార్తలు):** గౌరవ విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ చైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విజయనగరం ధరంపురి తన క్యాంప్ కార్యాలయం అందు విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్న శ్రీను మాట్లాడుతూ..కూటమి ప్రభుత్వానిది పని తక్కువ, ప్రచారం ఎక్కువ. ఒకవైపున ప్రభుత్వ పెద్దలందరూ టెక్నాలజీని ఉపయోగించి తుఫాన్‌ని ఎదుర్కొన్నామని గొప్పలు చెప్పుకుంటున్నారు... వాస్తవ పరిస్థితులు చూస్తే ..ఎంత మేర పంట నష్టం జరిగిందనే వివరాలను అధికారులను అడిగితే.. ఇంకా అంచనా వేయలేదని చెబుతున్నారు..మా వైఎస్ఆర్సిపి శ్రేణులను మా అధినేత జగన్ ముందుగానే అప్రమత్తం చేసి పార్టీ శ్రేణులు, నాయకులు అందరూ ప్రజలకు అండగా నిలవాలని ఆదేశించారు. వారి ఆదేశాల మేరకు మేము, మా పార్టీ శ్రేణులు జిల్లాలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అండగా నిలవడం జరిగింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మా అధినేత జగన్ జిల్లాలో తుఫాన్ వలన జరిగిన నష్టాన్ని, సహాయక చర్యలకు సంబంధించిన వివరాలను అడగగా, మేము తుఫాన్ వలన జరిగిన నష్టాన్ని, పార్టీ తరపున చేపట్టిన సహాయక చర్యలను వివరించాం. గాలుల తీవ్రత పెద్దగా లేకపోయినా, అధిక వర్షపాతం వలన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలియజేశాం...జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో మన పార్టీ శ్రేణులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి, పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి అందేలా కృషి చేయాలని వైయస్ జగన్ మమ్మల్ని ఆదేశించడం జరిగింది.. టెక్నాలజీని ఉపయోగించి తుఫాన్‌ని తరిమేసామని ఒకవైపు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుంది. వాస్తవ పరిస్థితులు చూస్తే లక్షల ఎకరాల పంటలు నీటిలో మునిగి ఉన్నాయి, రైతులు చూస్తే కష్టాల్లో ఉన్నారు. విజయనగరం జిల్లాకు సంబంధించి వరి, మొక్కజొన్న, పత్తి,




అరటి, బొప్పాయి, కాయగూరలు ఇలా అన్ని పంటలు తుఫాన్ దాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీనిపై ప్రభుత్వ యంత్రాంగం సత్వరమే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కోరుతున్నాం. మొక్కజొన్నకి సంబంధించి ప్రభుత్వం రూ. 2,400 మద్దతు దరగా ప్రకటించి కొనుగోలు చేస్తామని చెప్పింది, అలాగే పత్తి పంటను రూ. 8,110 కి కొనుగోలు చేస్తామని చెప్పింది. వాస్తవ పరిస్థితులు చూస్తే కొనుగోలు కేంద్రాలు కూడా తెరవలేదు. నేను అనేకసార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చి, పంట కొనుగోలు కేంద్రాలను తెరిచి, పంటలను కొనుగోలు చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. దీనితో రైతులు దళారులకు మొక్కజొన్నను 1800కి, పత్తిని 6000కి తప్పనిసరి పరిస్థితుల్లో అమ్ముకుని తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు వచ్చాయి. ఇప్పుడు తుఫాన్ దాటికి ఉన్న కాడికి పంటలు నీటి మునగడంతో రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. విజయనగరం జిల్లాలో 1.50 లక్షల మంది రైతులు 2.70 లక్షల ఎకరాలలో వరి సాగు చేశారు. ఈ పంట మొత్తానికి గత మా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ప్రభుత్వమే భీమ సొమ్మును చెల్లించేది. భీమా పరిధిలోనికి రాని రైతులకు ఇన్పుట్ సబ్సిడీని మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం చెల్లించేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక పంటల




భీమాను ఎత్తేసింది. రైతులే ఎకరాకు 200 చొప్పున చెల్లిస్తే వారికి భీమా వర్తించే పరిస్థితి వచ్చింది. విజయనగరం జిల్లాలో చూస్తే 32 వేల మంది రైతులు మాత్రమే ఇలా బీమా చెల్లించారు. 1.50 లక్షలమంది రైతుల్లో ఎకరాకి 200 రూపాయలు చొప్పున బీమా చెల్లించినవాళ్లు 32 వేల మంది మాత్రమే ఉన్నారంటే ...మరి మిగతా రైతుల పరిస్థితి ఏమిటి ? మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వలో 100 కి 100% ప్రభుత్వమే భీమా చెల్లించేది. బీమా పరిధిలోకి రాని రైతులకు కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇచ్చేది. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో 2020 లో నివార్ తుఫాన్, 2021 లో గులాబ్ తుఫాన్, 2023 లో మిచాంగ్ తుఫాన్‌లు వచ్చాయి. ఆ సమయంలో జిల్లాకు సంబంధించి భీమా పరిధిలో నికి రాని 16,540 మంది రైతులకు 8.67 కోట్ల రూపాయలను ఇన్పుట్ సబ్సిడీ ద్వారా అందించాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రైతులకు భీమా లేదు, ధీమా లేదు, ఇన్పుట్ సబ్సిడీ లేదు. రెండేళ్లకు సంబంధించి అన్నదాత సుఖీభవ కింద రైతులకు 40 వేల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 5000 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో ఈక్రాప్ నమోదు వందకి 100% జరిగేది, ఏ రైతు ఏ పంటను, ఎంత విస్తీర్ణంలో వేశారన్నది స్పష్టంగా ప్రభుత్వం వద్ద నివేదిక ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ క్రాప్ విధానాన్ని నిర్వీర్యం చేసింది. మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా రైతులకు విత్తనాల నుండి ఎరువులు సరఫరా, మద్దతు ధరతో పంటల కొనుగోలు వరకు అన్ని విధాలా రైతులకు అండగా నిలిచాం, క్రమం తప్పకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేశాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది, ఎరువుల కోసం, మద్దతు ధర కోసం రైతులు ఎంత ఆవేదన చెందారన్నది ఇటీవల కాలంలో మనమంతా చూశాం. కొన్ని ప్రాంతాల్లో టిడిపి నేతలు టిడిపికి చెందిన వారికి మాత్రమే కొన్ని స్లిప్పులను ఇచ్చి, ఆ స్లిప్పులు ఉన్న వారికి మాత్రమే యూరియా అందించే సంఘటనలను మనమంతా చూశాం. మా నాయకుడు వైయస్ జగన్ ఆదేశాల మేరకు మా పార్టీ నేతలు, వైఎస్ఆర్సిపి అభిమానులు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి ఎంత మేర పంట నష్టం జరిగిందన్నది ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి అందేలా కృషి చేస్తాం. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పూర్తిస్థాయిలో పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని వారిని కోరుతున్నాను. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమాన్ని ఇప్పటికే మా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది. అయితే విజయనగరం జిల్లాకు సంబంధించి ఈనెల 28వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో జరగాల్సిన ర్యాలీ కార్యక్రమాన్ని తుఫాన్ కారణంగా నవంబర్ 11వ తేదీకి వాయిదా వేయడం జరిగింది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు కెవివి సూర్యనారాయణ రాజు, నేక్కల నాయుడు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ మూర్తి, వైస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.


# అయ్యప్ప స్వామి పడి పూజ మహోత్సవం





**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండల కేంద్రంలో నేడు శ్రీ సాయి వెంకటరావు రైస్ మిల్ ఆవరణలో వైఎస్ఆర్సిపి యువ నాయకుడు మామిడి తిరుపతిరావు గురుస్వామి ఆధ్వర్యంలో శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం సందర్భంగా నేడు సుమారు 5000 మందికి అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

అలాగే సాయంత్రం అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం కన్నుల పండుగ భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పూజా కార్యక్రమాలు ఆరవెల్లి విజయకుమార్ శర్మ మరియు గాడేపల్లి లక్ష్మి నరసింహ శర్మ పండితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్కువ జడ్పిటిసి వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి మావుడి శ్రీనివాసరావు అలాగే మండల వైయస్సార్సీపి అధ్యక్షులుమావుడి రంగు నాయుడు వైఎస్ఆర్సిపి యువ నాయకులు మావుడి చరణ్ గ్రామ చెందిన భక్తులు యావన్మంది ఈ కార్యక్రమంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాన్ని తిలకించారు.



# ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ

**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం మరియు గ్రామములో వేంచేసి యున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంనకు నూతన ధర్మ కర్తల మండలి నియామకం కొరకు G.O.RT.No.1321, తేది.31.10.2025 REVENUE (ENDOWMENTS.II) DEPARTMENT ఉత్తర్వులు అనుసరించి ధర్మకర్తల అభ్యర్థులు నుండి ధరఖాస్తులు కోరడమైనది. సదరు ప్రకటన వెలువడిన తేది నుండి 20 రోజులలోపు ఆసక్తి గలవారు పై దేవస్థానము కార్యాలయమునకు ధరఖాస్తులు అందజేయవలెను.

# కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలకు ఆరోగ్య సమస్య, తక్షణమే స్పందించిన అధికారులు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలంలో గల కాశీ పట్నం కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులకు అలాగే ఇంటర్ చదువుతున్న ఒక విద్యార్థినికి ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ప్రిన్సిపాల్ నాగదుర్గ సమాచారంతో ఇవ్వడంతో తక్షణమే స్పందించిన ఎంపీడీవో ఎన్. అర్జున్ రావు డిప్యూటీ ఎంపీడీవో ఎన్ సూర్యనారాయణ హుటాహుటిన హాస్టల్ వద్దకు చేరుకొని విద్యార్థులను దగ్గరుండి మక్కువ పిహెచ్సికి తరలించగా అక్కడ పరిశీలించిన పిమ్మట ఒక విద్యార్థిని తల్లిదండ్రుల అనుమతితో బొబ్బిలిలో ప్రైవేట్ హాస్పిటల్ తరలించారు. అలాగే మరొక విద్యార్థిని పార్వతీపురం ఏరియా హాస్పిటల్ కు రీఫర్ చేశారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులను మక్కువ పిహెచ్సిలో మెరుగైన వైద్యం అందించి తిరిగి హాస్టల్‌కు పంపించారు. విద్యార్థుల ఆరోగ్యం సంతృప్తికరంగా ఉందని అధికారులు తెలియజేశారు.


# ఘనంగా ఇందిరాగాంధీ వర్ధంతి - 15 మంది రక్తదానం

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 41వ వర్ధంతి స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. రక్తదాతల నుంచి వైద్యులు రక్తపూతలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, భారత దేశంలో మొట్టమొదటి మహిళా ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ అన్నారు. తన సమర్ధవంతపాలనతో ప్రపంచాన్ని భారతదేశపు వైపు చూసే విధంగా పాలించిన ఏకైక మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అన్నారు. ఆమె చూపిన మార్గంలో కాంగ్రెస్ శ్రేణులు నడుచుకుంటూ పార్టీకి గత వైభవం తీసుకు



రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భద్రాచలంలో రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు




**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా "జాతీయ ఐక్యత దినోత్సవం"ను పురస్కరించుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ - 2కే రన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ రన్ భద్రాచలం బ్రిడ్జి సెంటర్ నుండి జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారత ఐక్యతకు ప్రతీక అని, ఆయన స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సిఐ నాగరాజు, సిఆర్పిఎఫ్ 141 బెటాలియన్ 2వ కమాండెంట్ ప్రీత సి, ఎస్ఐ సతీష్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీసు సిబ్బంది, సిఆర్పిఎఫ్ జవాన్లు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పరుగెత్తారు. రన్ ఫర్ యూనిటీ ద్వారా ఐక్యత, సోదరభావం, దేశభక్తి విలువలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తక్షణమే ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి : చెట్ల రామారావు

**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** మోంథా తుపాను కారణంగా భారీగా నష్టపోయిన వరి పంట అరటి పంట అలాగే కొబ్బరి పంట రైతులను తక్షణమే ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నవ్యంధ్రప్రదేశ్ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ సెక్రెటరీ చేట్ల రామారావు డిమాండ్ చేశారు అలాగే పూరి గుడిసెలో ఉన్న నిరుపేదలకు చేపల వేటనే నమ్ముకున్న మత్స్యకారులను కూడా తక్షణమే ఆదుకోవాలి డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కొనసీమ జిల్లాలో కానీ రాష్ట్రంలో కానీ ఎప్పటికి కప్పుడు వర్షలు ఈదురు గాలులు వళ్ళ నిత్యం రైతులు నష్టపోతూనే ఉన్నారు ఇప్పుడు మోంథా తుఫాన్ కారణంగా కొద్ది రోజుల్లో చేతికి అందే పంట నష్టపోవడం దిక్కు తోచని పరిస్థితిలో రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు కాలయాపన చెయ్యకుండా వెంటనే ప్రభుత్వం మోంథా తుపాన్ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరికి నష్టపరిహారం చెలించాలని చేట్ల రామారావు డిమాండ్ చేశారు.



# సర్దార్ @150 యూనిటీ రన్ కార్యక్రమంలో పాల్గొన్న సీతం ఎన్.ఎస్.ఎస్. యూనిట్




**విజయనగరం, (రాజధాని వార్తలు):** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ – విజయనగరం జిల్లా పరిపాలన విభాగం ఆధ్వర్యంలో భారతదేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని సర్దార్ ఏ150 యూనిటీ రన్ నిర్వహించింది. విజయనగరం పోలీస్ బ్యారక్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహం నుండి ఉదయం 8:00 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం విజయనగరం ఎంపీ శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు నేతృత్వంలో ప్రారంభమైంది మరియు గౌరవనీయులైన ఆంధ్ర ప్రదేశ్ ఎమ్.ఎస్.ఎమ్.ఇ మంత్రివర్యులు కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి మరియు ఎస్పి ఎ.ఆర్.దామోదర్ ఈ కార్యక్రమానికి విచ్చేశారు. యూనిటీ రన్ సర్దార్ పటేల్ ఆశయాల స్ఫూర్తితో జాతీయ సమైక్యత మరియు ఐక్యత సందేశాన్ని ప్రచారం చేసింది. అలాగే ఎన్.సతీష్‌కుమార్, జేఎన్టీయూ గురజాడ విజయనగరం ఎన్.ఎస్.ఎస్ జిల్లా నోడల్ అధికారి, ఎన్.వి.సత్యనారాయణ రాజు సీతం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ మరియు సీతం కళాశాల కు చెందిన 100 మంది వాలంటీర్లు ర్యాలీలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భారతదేశ నిర్మాణానికి సమైక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభాయ్ పటేల్

## -ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : మంత్రి కొండపల్లి









**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి స్వేచ్ఛా వాతావరణం భారతదేశంలో ఉందంటే అది సర్దార్ వల్లభాయ్ పటేల్ వలనే అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఉద్ఘాటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక దేశ నిర్మాణానికి, సమైక్యతకు ఎంతో పాటుపడి ఎన్నో విషయాల్లో కఠినమైన నిర్ణయాలతో సమగ్రభారతావనిని నిర్మించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు. ఆ మహా నాయకుడి 150వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన గొప్పతనాన్ని యువతకు, భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈరోజు పోలీస్ ప్రాంగణం నుండి బాలాజీ కూడలివరకు సమైక్యతా ర్యాలీను నిర్వహించుకొంటున్నట్లు మంత్రి శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ శిక్షణా కళాశాల ప్రాంగణంలో ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి శ్రంధాంజలి ఘటించారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి సమైక్యతా ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, విజయనగరం శాసన సభ్యురాలు పూసపాటి ఆదితి గజపతిరాజు, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, కూటమి నాయకులు రాజేష్ వర్మ, పాలవలస యశస్వి, మై భారత్ జిల్లా యువజన సమన్వయ కర్త ప్రేమ్ భరత్ కుమార్, రెడ్ క్రాస్ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, పెద్ద సంఖ్యలో పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ దార్ల పుల్లయ్య





**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం తాసిల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దార్ల పుల్లయ్య శుక్రవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు పదవి విరమణ పొందిన దార్ల పుల్లయ్యని ఘనంగా సన్మానించారు.
తహసీల్దార్ మాట్లాడు తూ సుమారు 30 సంవత్సరాలనుండి రెవిన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ అందరితో స్నేహభావంతో ఉండే వ్యక్తి అని కొనియాడారు.
ఆయన శేష జీవితం సంతోషంగా కుటుంబంతో గడపాలన్నారు.
ఈ కార్యక్రమంలో డిటి వినయ్ శీల, గిరిధర్ నాగేంద్రప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వరలక్ష్మి మరియు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ కనబరిచిన గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహిక బహుమతులు అందించిన సీఐ గంగాధర్, ఎస్సై జిలానీలు




**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఆత్మకూరు పట్టణంలోని గురుకుల పాఠశాలలో ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన 9 మంది విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందించిన ఆత్మకూరు సిఐ గంగాధర్ మరియు ఎస్సై జిలానిలు వ్యాసరచన, చిత్రలేఖనం, చర్చ వేదిక పోటిలలో విద్యార్థులు పాల్గొనగా మొదటి మూడు స్థానాలు సాధించిన 9 మంది విద్యార్థులకు అభినందిస్తూ ఈ బహుమతులు అందించారు. చదువుతోపాటు ఇతర విభాగాల్లో కూడా విద్యార్థులు మెరుగైన ప్రతిభను కనబరిచి మంచి భవిష్యత్తుతో ఉండాలని మహిళల పట్ల జరిగే అఘాయిత్యాలపై అవగాహన కలిగి వాటిని ఎదుర్కొనే విధంగా విద్యార్థులు చైతన్యవంతులు కావాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సీఐ గంగాధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ ఇతర అధ్యాపకులు హాజరయ్యారు.

# వైభవంగా లలిత రుద్ర యజ్ఞం : పీఠాధిపతులు శ్రీ రాజరాజేశ్వరానంద స్వామి



**సంగం, (రాజధాని వార్తలు):** వైభవంగా లలితా రుద్ర యజ్ఞం (39వ రోజులు నిర్వహించినట్లు పీఠాధిపతులు శ్రీ రాజ రాజేశ్వరానంద స్వామి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం తిరుమన కొండలో వెలసి యున్న శ్రీ రాజరాజేశ్వరి దేవి జ్ఞాన పీఠంలో జరుగుతున్న లోక కళ్యాణం, విశ్వశాంతి కొరకు 45 రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 45 రోజుల యజ్ఞం 40 వరోజుకు చేరి అత్యంత వైభంగా శుక్రవారం నిర్వహించారు. సమాజంలో ప్రజలందరి యోగక్షేములు కొరకే గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు దేవాలయాలు పుణ్యక్షేత్రాలు వెలసినాయని తెలిపారు. రాష్ట్ర, దేశంలో వుండే అన్న దేవాలయాల్లో నూప, దీప నైవేద్యాలు, పూజలు, అర్చనలు, యజ్ఞులు సవ్యంగా జరిగిన రోజు ప్రజలందరు సుఖశాంతులతో ఆనందంగా జీవిస్తారని అన్నారు. మనం తినే పదార్థాలు మన శరీరానికి మాత్రమే వర్తిస్తాయని, యజ్ఞంలో ఉపయోగించే ద్రవ్యాలు అగ్ని దేవుడు ద్వారా దేవతలకు చెందినప్పుడు, సకల వ్యర్థం వల్ల, సకల జీవరాసులు సుబిక్షంగా వంటారని తెలిపారు. నవంబర్ 5వ తేది కార్తీక్ పౌర్ణమి సందర్భంగా పూర్ణిషతి కార్యక్రమం జరుగుతుందని పఠాధిపతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళ భక్తులు, తదితరులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల రక్తాన్ని జలగల్లా పీల్చేస్తున్నారు


## - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి : ఏఐటీయూసీ డిమాండ్

## - గూడూరులో ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం




**గూడూరు, (రాజధాని వార్తలు):** కేంద్ర, రాష్ట్ర పాలకులు కార్మిక చట్టాలను హరిస్తూ కార్మికుల శ్రమను జలగల్లా దోచుకుంటున్నారని ఏఐటీయూసీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం గూడూరులో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టవర్ క్లాక్ సెంటర్లో ఏఐటీయూసీ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడే ఏకైక యూనియన్ ఏఐటీయూసీ అన్నారు. చీకాగో నగరంలో 8 గంటల పని కోసం ఎంతో మంది కార్మికులు తమ రక్తాన్ని చిందించారన్నారు. ఆ రక్తం నుండి పుట్టిన జండాయే ఏఐటీయూసీ ఎర్ర జండా అన్నారు. బీజేపీ పాలకులు కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంక్షేమ నిధులను ప్రభుత్వాలు పక్కదోవ పట్టిస్తున్నాయన్నారు. కార్మికుల కనీస వేతనం 26 వేలు ఉండాలని సుప్రీం కోర్టు ప్రకటించినా పట్టించుకోవడం లేదని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు ఐక్య పోరాటాలే శరణ్యమన్నారు. ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా మాట్లాడుతూ ఏఐటీయూసీ ఎన్నో ఏళ్లుగా పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 44 కార్మిక చట్టాలను ఈ ప్రభుత్వం 4 లేబర్ కోడ్స్ గా మార్చిందన్నారు. కార్పొరేట్ బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా కార్మిక చట్టాను హరించేందుకు ప్రయత్నిస్తే ఏఐటీయూసీ, ఇతర ట్రేడ్ యూనియన్లతో కలిసి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అంతకుముందు ఇన్సాఫ్ నాయకులు జమాలుల్లా చేతులమీదుగా ఏఐటీయూసీ జండాను ఆవిష్కరించారు. జిందాబాద్ జిందాబాద్ ఏఐటీయూసీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కే.నారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, ఇన్సాఫ్ రాష్ట్ర ఉప కార్యదర్శి షేక్ జమాలుల్లా, మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి రాఘవయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి మీరా సాహెబ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులుయ్, కార్మికులు, ఆటో యూనియన్ నాయకులు విద్యానగర్ ఆటో స్టాండ్ నాయకులు షేక్ నజీర్, అశోక్, కస్తూరయ్య, దసయ్య, దయాకర్, ఖాదర్, దుర్గా, భ. ని. కా సంఘం మీరా సాహెబ్, హబీబ్, జిలాని, ఫారుఖ్, రసూల్, చెంచయ్య, బాల, దస్తగిరి, శీను తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



**పెళ్ళకూరు, (రాజధాని వార్తలు):** నాయుడుపేట పెళ్లకూరు మండలం, పెళ్లకూరు గ్రామంలో ప్రభుత్వం మెడికల్ కాలేజ్ ప్రైవేటి కరణకు వ్యతిరేకంగా రాష్ట్ర కార్యదర్శి కరణం రఘునాయుడు, మండల వైస్సార్సీపీ కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం, ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎన్డిడిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈరచ్చబండ కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ వారి సంతకాల సేకరించారు. సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం మరియు పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను అందించాలనే సంకల్పంతో వైఎస్ఆర్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్సిపి పాలనలో కేవలం రెండేళ్లలో 17 మెడికల్ కాలేజీలో నిర్మాణ చేపట్టినారు అందులో ఐదు కాలేజీలలో అడ్మిషన్ కూడా ప్రారంభం అయ్యాయని మరియు రెండు పూర్తి దశకు చేరుకున్నాయని తెలిపారు మిగిలిన 10 మెడికల్ కాలేజీలను కోటను ప్రభుత్వం పూర్తి చేసి పేదలకు అందుబాటులోకి తీసుకురావాల్సింది పోయి వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు పొందుతున్న కుట్రలు అన్ని ఇన్ని కావన్నారు చంద్రబాబుకి ఎంత కచ్చితంగా చులకన అర్థం కావడం లేదన్నారు ఎన్నికలలో ఇచ్చిన ఆమెలను నెరవేరించడంలో పూర్తీ వైపళ్ళ ప్రభుత్వం మెడికల్ కాలేజీలు పూర్తి చేయడం నిర్ణయం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిలా, రాష్ట్ర వైస్సార్సీపీ బీసీసెల్ సెక్రటరీ ఎల్లు మోహన్, యువజన విభాగ అద్యక్షులు సాగి జితేంద్రా, వాలెంటీర్ వింగ్ శ్రీపురం మునిరాజా, బండి బాలు, కళాకారుల అధ్యక్షులు అట్లా క్రిష్ణయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లాం సురేష్ ,మండల బీసీసెల్ అధ్యక్షులు దయకృష్ణ యాదవ్, మోహన్ రెడ్డి, సౌటూరు నాగరాజు మస్తాన్ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS


- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్సానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పాట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# అయినవిల్లిలంక గ్రామమును సందర్శించిన అధికారి



**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** కొత్తపేట డివిజనల్ డెవలప్ మెంట్ అధికారి టి.ఆర్.రాజేశ్వర రావు ఈ రోజు అయినవిల్లిలంక గ్రామ మును సందర్శించినారు. గ్రామములో జరుగు సూపర్ శానిటే షన్, సూపర్ క్లోరినేషన్ ప్రక్రియలను పరిశీలించి గ్రామములో ఎక్కడా అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా చూడాలని పంచా యతీ కార్యదర్శిని ఆదేశించారు. తుఫానుకు దెబ్బతిన్న ఆస్తి,పంట నష్టములపై వివరాలు తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిడిఓ జి.సరోవర్, డిప్యూటీ ఎంపిడిఓ వాణి కుమారి బెహరా, పంచా యతీ కార్యదర్శి మూర్తి పాల్గొన్నారు.

# ఏలేరు జలాల విడుదలతో ఇబ్బందులు రాలేదు

## - ప్రమాదకర కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్ఇలు

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ఏలేరు ప్రాజెక్టు అధిక మొత్తంలో జలాలను విడుదల చేసినప్పటికీ ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా వరదను కట్టడి చేయగలిగామని ఏలేరు ఇరిగేషన్ ఎస్ఇ గోపీనాథ్ వెల్లడించారు. పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువ పెద్దవంతెన వద్ద లాకులను, నీటి ఉధృతిని ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్ శుక్రవారం పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టులో అధిక జలాలు రావడంతో మిగులు జలాలు 6 వేల క్యూ సెక్కులు వరద నీటిని కిందకు వదలడం జరుగుతుందని అన్నారు. సాయంత్రానికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతుందని ఆయన అన్నారు. ఏలూరు వరద కారణంగా చెప్పుకోదగ్గ ఇబ్బందులు ఎక్కడ తలకు తెలియదు అన్నారు. అక్కడఅక్కడ చిన్నపాటి ఇబ్బందులు ఉన్నా తమ అధికారులు సిబ్బంది వాటిని కట్టడి చేయడం జరిగిందన్నారు. ఇంకా లోతట్టు ప్రాంతాల్లో తమ సిబ్బంది అప్రమత్తంగానే ఉండి వరద పరిస్థితిని పర్యవేక్షిస్తున్నటి చెప్పారు. ఏలేరు జలాలు తగ్గుముఖం పట్టినందున రైతులు ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఇ వెంట ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

**దబ్బ కాలువను పరిశీలించిన ఎమ్మెల్యే :**

ఏలేరు వరద కారణంగా ఉధృతిగా ప్రవహిస్తున్న దబ్బ కాలువను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఏలూరు





అధికారులతో పరిశీలించారు. తూములు పట్టనంతగా ఉదృతంగా ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారిన పెద్దాపురం మండలం కాంద్రకోట గ్రామంలోని దబ్బ కాలువను ఎమ్మెల్యే పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కాలువకు చిన్నపాటి గండి ఏర్పడి పంట పొలాల్లోకి వరద జలాలు చేరడంతో రైతులు ఆందోళన గురయ్యారు. అయితే తక్షణం గండు పూర్చే కార్యక్రమానికి అధికారులు పూనుకున్నారు.

# జాతీయ సమైఖ్యతకు "నేషనల్ యూనిటీ డే" దోహదం




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** జాతీయ సమైఖ్యతకు నేషనల్ యూనిటీ డే వంటి కార్యక్రమాలు దోహదపడతాయని పెద్దాపురం పిఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అన్నారు. శుక్రవారం "ఏక్ తా దివస్" అనే నేషన్ యూనిటీ డే అనగా దేశ సమైక్యత దినోత్సవం కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. విద్యాలయ 18 ఆంధ్ర ఎన్సిసి, 3వ ఆంధ్ర గర్ల్స్ ఎన్సిసి బెటాలియన్లకు చెందిన సిసి క్యాడేట్స్‌చే ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల్లో దేశభక్తి, వ్యక్తి భావం, ఆత్మ నిర్భయ ఇంకా ఐకమత్య భావాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యాలయ సీనియర్ డివిజన్ ఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ సనసల సత్యనారాయణ అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో ఎన్సిసి విద్యార్థులచే యూనిటీ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే ఎస్ఐ రెడ్డి కాంపిటీషన్లను, ఇంకా "యూనిటీ రన్" అనే కార్యక్రమాలను పిల్లల్లో జాతీయ సమైక్యత పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్నట్టు విద్యాలయ జూనియర్ డివిజన్ ఏఎన్ఓ, సెకండ్ అధికారి మహంతి లక్ష్మణ్‌రావు తెలిపారు. యూనిటీ డే భారతదేశ ప్రధాన హోమ్ మినిస్టర్‌గా పనిచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా జరుపుకోవడం జరుగుతుందని విద్యాలయ సీనియర్ ఉపాధ్యాయులు దేశభక్తులు చక్రవర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకుంటున్నారు : ఎమ్మెల్యే

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీలో వైసీపీ కౌన్సిలర్లు అభివృద్ధిని అడ్డుకుంటున్నారని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప విమర్శించారు. సామర్లకోట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న కాపు కళ్యాణ మండప పనులను శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాపు కళ్యాణ మండపానికి తమ పార్టీ శ్రీకారం చుట్టుగా తదుపరి వైసిపి పాలనలో కళ్యాణ మండపాన్ని పట్టించుకోని కారణంగా అది మరుగుదొడ్డిలా మారిందన్నారు. ప్రస్తుతం మరలా కూటమి ప్రభుత్వంలో కళ్యాణ మండప ఆధునీకరణకు రూ. 10 లక్షలు నిధులు అందించగా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఇంకా రూ. 10 లక్షలు నిధులు అవసరం అయి ఉండగా వాటిని కూడా సమకూర్చలు ఉన్నట్టు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తదుపరి కల్యాణ మండప నిర్వహణకు గాను రూ. 10 వేలు అద్దె నిర్ణయిస్తున్నట్టు చెప్పారు. మరో 3 నెలల్లో కళ్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకు వస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

**అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీ :**

పెద్దాపురం నియోజక వర్గ అభివృద్ధిలో భాగంగా సామర్లకోట మున్సిపాలిటీలో ఇప్పటివరకు రూ. 10 కోట్లు అభివృద్ధి చేపట్టినట్టి



ఎమ్మెల్యే చిన రాజప్ప చెప్పారు. ఇంకా అభివృద్ధి పనులు జరుగుతున్నట్టు చెప్పారు. అయితే మున్సిపాలిటీలో అభివృద్ధికి వైసీపీ కౌన్సిల్ కలిసి రాకుండా అడ్డుపడుతున్నట్టు చెప్పారు. ఈరోజు కౌన్సిల్ సమావేశంలో కూడా అభివృద్ధి పనులపై తీర్మానం జరగకుండా వారు అడ్డుకున్నట్టు విమర్శించారు. దీనిపై తదుపరి ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందాన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, తెదేపా నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, కంటే జగదీశ్ మోహన్, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్ కుమార్, కౌన్సిలర్‌లు పిల్లాడి సత్యవతి, రామలక్ష్మి, శెట్టిబత్తుల దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan